# చట్టాతీతులు



**అ**సలే కృష్ణపక్షం!

దానికితోడు- ఆకాశం మబ్బులు కమ్ముకుని ఉంది.

అటువంటి సమయంలో ఆ సందు ఎప్పటికన్నా మరింత చీకటిగా ఉంది. పేరుకి మునిసిపాలిటీ వాళ్ళు వేసిన దీప స్తంభాలు ఉన్నాయి కాని, వాటికి బల్బులు ఉండడం- ఉన్నా అవి వెలగడం అతి అరుదు. ఒకవేళ ఎప్పుడైనా కర్మ కాలి, దారితప్పి మునిసిపాలిటీ వారికి బుద్ధిపుట్టి కొత్త బల్బులు వేసినా మరునాటికల్లా వాటిని టపటపా పగలకొట్టేస్తారు.

ఆ సందులోని జనానికి చీకటి అంటే ఇష్టమో, లేక కావాలని చీకటిని కోరుకుంటారో తెలియదు. అవకాశం లేదు కాని, ఉంటే చందమామనికూడా మూసేసేవారే!

ఆమధ్య పేపర్లలో ఒక వార్త వచ్చింది-

మన మహాభాగ్యనగరంలో ఒక కాలనీలోవున్న కమ్యూనిటీ హాల్ కాంపౌండ్ చుట్టూ వున్న వీధి దీపాల్ని ఎన్నిసార్లు వేసినా ఎవరో మర్నాటికల్లా పగలగొట్టివేస్తున్నారట. ఆ దుండగులను పట్టుకోడానికి కార్పోరేషన్‌వారు ఒక స్క్వాడ్‌ని రహస్యంగా నియమించి చీకటిపడ్డాక మాటువేసి ఉంచారట.

తీరా... పట్టుబడ్డ ఆ దుండగుల ముఖారవిందాలను చూసేసరికి ఆశ్చర్యంతో నోట మాటరాక ముక్కున వేలేసుకోవడమేకాక, మూర్ఛపోయినంత పనయిందట! ఇంతకీ... ఆ ఘనకార్యం చేస్తోంది ఎవరోకాదు- సాక్షాత్తూ మన తెలుగింటి ఆడపడుచులు.

'వీళ్ళకి ఇదేం పోయేకాలం! బహుశా... తమ అత్తల మీద కోపం ఈ బల్బుల మీద చూపుతున్నారేమో!' అని అనుకున్నారట. కాని, అదేమీ కాదట.

'మరి, అసలు సంగతి ఏమిటయ్యా?' అంటే... అక్కడ కమ్యూనిటీ హాలు కోసం కేటాయించిన స్థలాన్ని వారు కమ్యూ'నీట్'గా 'తెలుగు మహిళా బహిర్ ప్రాంగణం'గా ఉపయోగిస్తున్నారట. ఆ కాలనీ లోని అంగనామణులు చీకటి చాటున తమ ప్రకృతి అవసరానికి ఆ కాంపౌండ్‌నే బహిర్భూమిగా మార్చి వాడుకుంటున్నారట. లైట్లు ఉంటే సున్నితమైన ఆ వ్యవహారానికి ఇబ్బంది కనుక ఈ అఘాయిత్యానికి పూనుకుంటున్నారట. ఎంతైనా స్త్రీలకు సిగ్గే సింగారం కనుక, కావాలనే బల్బులను పగులగొట్టి చీకటిని ఆహ్వానిస్తున్నారట.

అయితే- మనం ముచ్చటించుకొంటున్న సందులోని వ్యవహారం మాత్రం ఈ బాపతుది కాదు. అది పూర్తిగా వేరే వ్యవహారం! ఆ చీకటి ప్రియులు, ఆ రజనీకాంతులు ఎవరో తెలుసుకోవాలంటే ఆ సందు మూల పాత పెంకుటింటి వసారాలోకి పోయి చూడాలి.

ఆ పెంకుటింటి వసారాలో ఒక బాలీసు మీద కూర్చొని, మరొక దిండు గోడకి వేసి దానికి ఆనుకుని కూర్చుని ఉన్నాడు... ఒక లావుపాటి బొజ్జగణపతి. బొద్దుమీసాలు, ఉంగరాల జుట్టుతో ఆ మహాకాయాన్ని చూస్తే పిల్లలు ఝడుసుకోవడం ఖాయం.

అతగాడు చిన్న చిన్న కాగితం ముక్కల మీద ఏదో రాస్తున్నాడు.

అతని చుట్టూ బెల్లం మీద ముసిరిన ఈగలలాగా ఎంతోమంది మూగి ఏవేవో అంకెలు చెప్తూ డబ్బులు ఇస్తున్నారు. ఆ డబ్బులు తీసుకుని ఆ వ్యక్తి తాను నంబర్లు రాసిన కాగితాన్ని రెండు ముక్కలు చేసి, ఒక ముక్కను తాను ఉంచుకుని మరో ముక్కను డబ్బు ఇచ్చినవారికి

ఇస్తున్నాడు. అక్కడ చేరినవాళ్ళలో రిక్షావాళ్ళు, హోటల్ సర్వర్ల దగ్గర్నుంచి గవర్నమెంట్ ఉద్యోగులు, బ్యాంక్ ఎంప్లాయీస్ వరకు అన్ని వర్గాలవారూ ఉన్నారు. దీన్నే 'సట్టాజూదం' అనీ, 'నంబర్ల ఆట' అనీ అంటారు.

బాగా వెనుకటికాలంలో దీనిని 'కాటన్ మార్కెట్' అనేవారు.

ఆరోజుల్లో ప్రతిరోజూ అర్ధరాత్రిపూట న్యూయార్క్ నుంచి ఫోన్‌లో రోజువారీ ప్రత్తిధరలు వచ్చేవి. వాటిని ముందుగా ఊహించి సరిగ్గా చెప్పినవారికి వారు పెట్టిన మొత్తానికి తొమ్మిది రెట్లు ఎక్కువ ఇచ్చేవారు. ఈ ధరలు రోజుకి రెండుసార్లు వచ్చేవి. వాటిలో మొదటిదానిని 'ఓపెనింగ్' అనీ, రెండోదానికి 'క్లోజింగ్' అనీ అనేవారు. ఈ రెండు నంబర్లనూ సరిగ్గా చెప్తే దానిని 'బ్రాకెట్' అనేవారు. ఈ బ్రాకెట్ వచ్చినవారికి 80 రెట్లు ఇచ్చేవారు.

ఈ మార్కెట్ వ్యవహారం ఇప్పుడు మన దేశంలో లేదు.

ఇప్పుడు ఈ ఆటకి కేంద్రబిందువు ముంబాయి నగరం. ప్రతిరోజూ ఆ నగరం నుంచి సట్టాకింగ్ 'రతన్ ఖత్రీ' తనకి తోచిన నంబరు చెప్తాడు. వెంటనే ఆ నంబరు ఫోన్‌ల ద్వారా దేశంలో మూలమూలలకూ వెళ్ళిపోతుంది. విచిత్రమేమిటంటే... తరచుగా మూగపోతుండే మన ఫోన్‌లు ఆ సమయంలో మాత్రం మహా ఆరోగ్యంగా ఉంటాయి. డాన్ రతన్ ఖత్రీ నంబర్ వచ్చే సమయానికి ఫోన్‌లు చెడిపోవడమంటూ ఉండదు. దేశంలోని టెలిఫోన్ సిబ్బందిని ఈ సట్టా వ్యాపారులు కొనేస్తారు కనుకనే ఆ సమయంలో ఫోన్‌లు చెడిపోవని జనం చెవులు కొరుక్కుంటుంటారు.

రతన్ ఖత్రీ కోటీశ్వరుడు.

ఒక్క కోటికే కాదు.., కోటానుకోట్లకు పడగలెత్తినవాడు. అతను అండర్‌వరల్డ్ కింగ్‌-మాఫియా డాన్. ప్రధాన మంత్రి దర్శనం అయినా సులువుగా అవుతుందేమో కాని, అతని దర్శనం మాత్రం కాదు. అతడికి ఉన్న సెక్యూరిటీ దేశ ప్రధాని, రాష్ట్రపతులకు ఉండే సెక్యూరిటీని మించి ఉంటుంది. అతని నీడను చూసినా మహామహా పోలీసు అధికారులు కూడా వణికిపోతారు.

ఈ చీకటి సామ్రాజ్యాన్ని యథేచ్ఛగా, నిరంకుశంగా ఏలుతున్నాడు రతన్ ఖత్రీ.

ఆ సందులో సట్టా వ్యాపారం నడుపుతున్నవారు రతన్ ఖత్రీ సామ్రాజ్యంలో సామంతుల వంటివారు. అటువంటి సామంతులు దేశమంతటా పల్లెపల్లెలలో కూడా ఉన్నారు.

రతన్ ఖత్రీ చెప్పే నంబర్లను నమ్ముకుని ఎంతోమంది ఆశాజీవులు తమ కష్టార్జితాన్ని ఫణంగా పెట్టి తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటుంటారు.

ఈ 'సట్టాజూదం' చట్టప్రకారం నేరం కాబట్టి దానిని నడిపే సామంతులు కావాలనే ఆ సందులోని వీధి దీపాల్ని పగలకొట్టి చీకట్లో ఈ వ్యాపారం సాగిస్తుంటారు. సమాంతర పరిపాలన సాగించేవారిని ఎదిరించే ధైర్యం ఎవరికీ లేదు. అందుకే ఆ సందులోని మిగతా ఇళ్లవారు నోరెత్తకుండా ఆ బాధను భరిస్తుంటారు.

ఇంతలో ఒక వ్యకి రయ్... మని సైకిల్ మీద వగరుస్తూ వచ్చి, 'పోలీస్ వ్యాన్ వస్తోం'దన్న కబురు తెచ్చాడు. వెంటనే అక్కడ మూగిన వారందరూ కనిపించిన దారంబట ఉరుకులూ, పరుగులూ లంకించుకున్నారు. అంతా తొడతొక్కిడి అయింది.

ఈలోగా పోలీస్ వ్యాన్ రానేవచ్చింది- హారన్ మ్రోగించుకుంటూ.

నక్క ఊళ పెడుతున్నట్లు శబ్దం చేస్తూ వ్యాన్ ఆగీ ఆగగానే అందులోంచి ఖాకీవీరులు లాఠీలు పట్టుకుని ఒక్క ఉదుటున క్రిందికి దూకి, పారిపోతున్న జనాన్ని పట్టుకోడానికి ఉరుకులూ, పరుగులూ మొదలుపెట్టారు.

పోలీసులు చేతికి చిక్కినవాళ్ళని కాలర్ పట్టుకుని లాక్కొచ్చి వ్యాన్‌లోకి కుక్కేశారు.

ఇన్స్‌పెక్టర్ అక్కడ జమ అయిన సొమ్ముని స్వాధీనం చేసుకుని జేబులో భద్రంగా జాగ్రత్తపరిచాడు.

"లంజకొడుకుల్లారా... గుడుంబా తాగి సట్టా జూదం ఆడుతారర్రా! సట్టా ఆడడం నేరమని తెలీదర్రా..?" అంటూ పరిశుద్ధమైన కల్తీలేని దేశవాళీ బూతుల పంచాంగం మొదలుపెట్టాడు.

వ్యాన్‌లో మోసుకొచ్చినవాళ్ళని లాకప్‌లో పడేశారు పోలీసులు. పోలీసులకి మాసికాల్లాగా నెలనెలా మామూలుగా 'మామూళ్లు' ఉంటాయి. అయినా అప్పుడప్పుడు ఈ విధమైన దాడులు మామూలే! ఎందుకంటే... అసలెప్పుడూ పట్టుకోకపోతే పోలీసులకీ, సట్టా సామంతులకీ లాలూచీ ఉందని స్పష్టమవుతుందిగా!

దొరికిన వాళ్ళని స్టేషన్‌కి తీసుకొనిపోయి లాకప్‌లో పడేశారు.

ఈ 'రెయిడోపాఖ్యానం' పూర్తి అయ్యాక పోలీస్ జీప్ తిన్నగా నైట్‌క్లబ్‌కి చేరుకుంది.

ఇన్‌స్పెక్టర్‌గారూ, మరికొందరు పెద్దలూ లోపలికిపోయి చిత్తుగా విస్కీ తాగుతూ పేకాట మొదలుపెట్టారు. విస్కీ ఖర్చుకీ, పేకాట పెట్టుబడికీ- స్వాధీనం చేసుకున్న సట్టా సొమ్ము కావలసినంత ఉంది.

ఇన్‌స్పెక్టర్‌గారు క్లబ్‌లోకి వెళ్లాక- పోలీసులు తాము దొరకుబుచ్చుకున్న సొమ్ముతో గుడుంబా కాంపౌండ్‌కి పోయారు. ఇన్‌స్పెక్టర్‌గారికీ, వారి మిత్రులకీ నైట్‌క్లబ్‌లో క్రీడావినోదం పూర్తిఅయ్యాక, 'కేళీ వినోదం' కోసం స్టేషన్‌లోని ప్రత్యేక సెల్‌లో 'పిట్ట' రెడీగా ఉంది.

పోలీసులకి గుడుంబా పర్వం పూర్తి అయ్యాక దగ్గర్లో వున్న పెంకుటింటిలో గానాబజానాతో పాటు 'భామా కలాపం' సిద్ధంగా ఉంది.

పెద్దలు అక్కడ జారుకొని రాసక్రీడలో మునిగిపోయారు. పోలీసులు గుడుంబా దుకాణానికి దగ్గర్లోవున్న పెంకుటింట్లోకి దూరారు. అక్కడ వారికి పరిచయం అయిన అంగనామణులు స్వాగతం పలికారు బూతు జోకులతో.

గుడుంబా త్రాగడం నేరం- విస్కీ త్రాగడం హోదా!

సట్టా ఆడడం నేరం- పేకాట ఆడడం గౌరవం!

సామాన్యుడు ఆడితే జూదం- పోలీసులు ఆడితే కాలక్షేపం!

- ఇవీ నేటి చట్ట పరిరక్షకుల నీతి సూత్రాలు!!

ఎందుకంటే... మన రక్షకులు- చట్టాతీతులు!!!

*- విశ్వ రచన పక్ష పత్రిక... 1 సెప్టెంబర్' 91*



**ఇంకేమవుతుంది..?**

కేడెట్ ఆఫీసర్స్‌కి ట్రెయినింగ్ కోర్స్ జరుగుతోంది.

ఒక ముక్కుసూటి ఆఫీసరుగారు అనుకోకుండా ఆపదలు ఎదురైనప్పుడు ఏమిచెయ్యాలో, ఏమి చెయ్యకూడదో చెప్తూ లెక్చర్ ఇచ్చాడు. తర్వాత-

"మీరు వెళ్తున్న ట్రక్కు ముందు పాతర మీద నుంచి వెళ్లిందనుకోండి. అప్పుడు మీరేం చేస్తారు?" అని అడిగాడు.

కొంచెంసేపు ఎవరూ ఏమీ మాట్లాడలేదు. తర్వాత వెనకనుంచి ఎవరో నెమ్మదిగా-

"ఏంచేస్తాం... చస్తాం! బతికుంటే గాయాలతో నెత్తురు కారుతూ పడుంటాం!" అన్నాడు.